సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం, 13, మార్చి, 2025

నమ్మక ద్రోహంపై... గర్జన గళమై..



కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, విద్యార్థులు, నిరుద్యోగులు

- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కదం తొక్కిన యువత
- ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగాలు కల్పించాలని నినాదాలు
- కలెక్టరేట్ వద్ద ధర్నాకు భారీగా తరలి వచ్చిన విద్యార్థులు, నిరుద్యోగులు
- ప్రభుత్వ మెడలు వంచి హామీలు అమలు చేయిస్తాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన విడుదల చేయకుండా విద్యార్థులకు, ఉద్యోగాలు కల్పించకుండా కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు నమ్మకం ద్రోహం చేసింది. నిరుద్యోగ భృతి ఇస్తామంటూ నయవంచనకు పాల్పడింది. తమ భవిష్యత్‌ను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో సహా పెకలిస్తామంటూ యువత గర్జించింది. సర్కార్ మెడలు వంచి హామీలు అమలయ్యే వరకు విశ్రమించబోమని శపథం చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వీఆర్‌సీ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు మండు టెండను సైతం లెక్క చేయకుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన విడుదల చేయాలని, ఉద్యోగాలు కల్పించాలని, లేదంటే నిరుద్యోగ భృతి ఇవ్వాలంటూ నినాదాలు మార్మోగాయి. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఎ. ఆనంద్‌కు మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలతో కలిసి వినతిపత్రం అందజేశారు.

– నెల్లూరు (అర్బన్)



కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నిరుద్యోగులకు శాపం చంద్రబాబు

– పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ



రాష్ట్రంలో 2 లక్షల మంది వలంటీర్లను తొలగించిన ఘనుడు చంద్రబాబు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగిస్తూ యువతను నడిరోడ్డులో నిలబెడుతున్నాడు. ఎన్నికల సందర్భంగా 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ అని చెప్పాడు. గెలిచాక 16 వేల పోస్టులతో డీఎస్సీ అంటూ తొలి సంతకం చేశాడు. ఆ తొలి సంతకానికి నేటికీ దిక్కులేదు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి తల్లికి వందనం అని చెప్పి బాబు మోసం చేశారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద విద్యార్థులకు అండగా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ పెట్టారు.

విద్యార్థులను చదువుకు దూరం చేసే కుట్ర

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి



కూటమి ప్రభుత్వం విద్యార్థులను, నిరుద్యోగులను నయవంచనకు గురి చేసింది. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు రూ.7,100 కోట్లు ఉండగా బడ్జెట్‌లో కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే కేటాయించారు. దీన్ని బట్టి పేద విద్యార్థులను చదువుకు దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. రూ.8,900 కోట్లతో రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించగా, వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసేందుకు పూనుకోవడం దుర్మార్గ చర్య. 2024–25 ఏడాదికి తల్లికి వందనం ఇవ్వకుండా మోసం చేశారు. 2025–26 సంవత్సరానికి రూ.12 వేల కోట్లు అవసరం కాగా, బడ్జెట్‌లో కేవలం రూ.7,600 కోట్లు పెట్టి తల్లికి టోకరా పెట్టబోతున్నారు. సంవత్సరానికి 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామని ఊదరగొట్టిన చంద్రబాబు ఒక్క ఉద్యోగం కల్పించలేదు. నిరుద్యోగ భృతి రెండేళ్లకు కలిపి రూ.72,000 కోట్లు అవసరం కాగా బడ్జెట్‌లో ఆ ఊసే లేదు. ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీస్తున్నారు. పోరాటాలతో ప్రభుత్వ మెడలు వంచి తీరుతాం.

యువత భవిష్యత్ నాశనం

– రామిరెడ్డి ప్రతాపకుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే



చంద్రబాబు ప్రభుత్వం మాయమాటలతో యువత భవిష్యత్‌ను నాశనం చేసింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో లక్షలాది మంది పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆ పథకాన్ని ఇంకా మెరుగ్గా కొనసాగించింది. పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, నాడు–నేడుతో విద్యాలయాల ఆధునికీకరణ, వసతుల కల్పన, ఆటలు, కళాశాలల అభివృద్ధి తదితర అనేక మార్పులు జగన్‌మోహన్‌రెడ్డి చేయగా, చంద్రబాబు ఇంగ్లిష్ మీడియంను రద్దు చేస్తామని పేర్కొనడం, రాష్ట్రంలోని నూతన మెడికల్ కళాశాలల్లో 2,500 సీట్లు వద్దని చెప్పడం సిగ్గు చేటు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నింది.

మోసానికి మారు పేరు చంద్రబాబు

– ఆనం విజయకుమార్‌రెడ్డి, నెల్లూరు రూరల్



చంద్రబాబు మోసానికి మారు పేరు. పేద, బడుగు, బలహీన వర్గాల బిడ్డలకు అండగా ఉండాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొనసాగించింది. ప్రతిభ ఉన్న విద్యార్థులను జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సహించారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ పథకాలు ఇవ్వకుండా నిలుపుదల చేయడం దుర్మార్గం. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేస్తున్నాడు.

బాబుది మోసపూరిత పాలన

– బుర్రా మధుసూదన్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే, కందుకూరు ఇన్‌చార్జి



అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు స్వర్ణయుగం పాలన అందించారు. చంద్రబాబు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం, నిరుద్యోగులను మోసం చేయడం, సూపర్ సిక్స్ పథకాలంటూ నిలువునా ముంచుతూ మోసపూరిత పాలన చేస్తున్నారు.

మనస్సు లేని పాలన బాబుది

– మేరిగ మురళీధర్, ఎమ్మెల్సీ



జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న కాలంలో క్రమం తప్పకుండా సంక్షేమ పథకాలు అందేవి. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను ఆపలేదు. ప్రాంతం, మతం, కులం, రాజకీయాలు చూడకుండా అందరికీ ప్రభుత్వ ఫలాలు అందించారు. అయితే చంద్రబాబు ఇందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎలాంటి పథకాలు అమలు చేయకూడదని సీఎంగా ఉంటూ చెప్పడం రాజ్యాంగ విరుద్ధం.

బాబు మోసాలకు భవిష్యత్ బలి

– నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి



జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాల పేర్లను చంద్రబాబు మార్చుతున్నాడు. రెట్టింపు ప్రయోజనాలు కల్పిస్తామని చేసిన మోసాలకు ప్రజల భవిష్యత్ బలి అయిపోయింది. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కళాశాలలకు ఇవ్వడం లేదు. ఫీజులు గురించి విద్యార్థులను బలవంతం పెడితే జైలుకు పంపుతామని బెదిరిస్తోంది. అధ్యాపకులు, సిబ్బందికి జీతాలు ఎలా చెల్లించాలి. గతంలో నిరుద్యోగ భృతి రూ.2 వేలు చెప్పాడు. ఈ ఎన్నికల్లో రూ.3 వేలు ఇస్తానని చెప్పాడు.

జగన్ ఆరు నెలల్లో 1.90 లక్షల ఉద్యోగాలిచ్చారు

– ఊటుకూరు నాగార్జున, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన 6 నెలల కాలంలోనే 1.90 లక్షల ఉద్యోగాలు కల్పించారు. చంద్రబాబు గద్దెనెక్కి 9 నెలలు అవుతున్నా.. మాయమాటలతో కాలం వెళ్లబుచ్చుతున్నాడు. ప్రజలు వాస్తవాలు గ్రహించాలి. మోసం చేసే వారికి తగిన బుద్ధి చెప్పాలి

అబద్ధాలు చెప్పడం బాబు నైజం

– మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి



అబద్ధాలు చెప్పడం చంద్రబాబు నైజం. తాము మోసపోయామని ప్రజలు మరోసారి తెలుసుకున్నారు. 2014–19 పాలన చూసి కూడా బాబు మాటలు నమ్మి మారిపోయాడని ప్రజలు ఓట్లేశారు. ఫలితంగా మరో 4 ఏళ్లు ప్రజలు బాధలు భరించాల్సి ఉంది. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో చెప్పిన హామీల కన్నా అదనంగా సంక్షేమ ఫలాలు అందించారు. ప్రజలు నిరుత్సాహం పడకుండా చంద్రబాబు, ఆ పార్టీ ఎమ్మెల్యేలను నిలదీయాలి. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసుకుందాం.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



ప్లకార్డులతో పోరుబాట పట్టిన విద్యార్థులతో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న కాకాణి



ధర్నా నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



న్యూస్‌రీల్

బీఈడీ పరీక్షలకు 72 మంది గైర్హాజరు

వెంకటాచలం: వీఎస్‌యూ అనుబంధ కళాశాలల్లో బుధవారం జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు 72 మంది గైర్హాజరయ్యారని ఎగ్జామ్స్ అధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మొత్తం 965 మందికి 893 మంది విద్యార్థులు హాజరు కాగా, 72 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఇంటర్‌లో 500 మంది..

నెల్లూరు (టౌన్): ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు బుధవారం 500 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 23,420 మందికి 22,963 మంది హాజరయ్యారు. 457 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 987 మందికి 944 మంది హాజరయ్యారు. 43 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆర్‌ఐఓ 6, డీవీఈఓ 2, డీఈసీ 5, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు 31 పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావమే చారిత్రాత్మకం

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- ఘనంగా ఆవిర్భావ దినోత్సవ సంబరాలు
- పార్టీ జెండా ఎగుర వేసిన నేతలు



వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కాకాణి, పార్టీ నాయకులు

నెల్లూరు (బారకాసు): దేశ రాజకీయ యవనికపై వైఎస్సార్‌సీపీ ఆవిర్భావమే ఒక చారిత్రాత్మకం, ఉప ఎన్నికల నుంచి సార్వత్రిక ఎన్నికల వరకు వైఎస్సార్‌సీపీ విజయాలు అప్రతిహతంగా కొనసాగాయని మాజీమంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరు నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎగురవేశారు. కార్యాలయ ఆవరణలో ఉన్న దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్‌కట్ చేసి అందరికి పంచి పెట్టారు. కాకాణి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి ఆశీస్సులు, ఆదరణ అందించిన ప్రజానీకానికి, నాయకులు, కార్యకర్తలకు, సానుభూతిపరులు, వైఎస్సార్, వైఎస్ జగన్ అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 14 వసంతాలు పూర్తి చేసుకుని 15వ వత్సరంలోకి అడుగు పెట్టిందన్నారు. ఈ 14 ఏళ్ల పాటు పార్టీ అనేక ఒడిదొడుకులను ఎదుర్కొందన్నారు. ఇడుపులపాయలో 2011న మార్చి 12న మహానేత డాక్టర్ వైఎస్సార్ సమాధి వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించినట్లు గుర్తు చేశారు. ఒక్క ఎమ్మెల్యే, ఒక్క ఎంపీతో ప్రారంభమైన పార్టీ ప్రస్థానం ప్రతిపక్ష పార్టీగా, అధికార పార్టీగా నిలిచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మరింత చేరువయ్యారన్నారు. కోట్లాది మంది ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ, విలువలు, విశ్వసనీయత ఐదేళ్ల జగన్ పరిపాలన కొనసాగించారన్నారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా వాడవాడల వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడానికి కారణం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద ప్రజల్లో ఉండే నమ్మకమేనని చెప్పారు. గడిచిన 9 నెలల్లోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేయకుండా చంద్రబాబుకు ఓటు వేసి అధికారం ఇచ్చి తప్పు చేశామనే భావన ప్రజల్లో ఉందన్నారు. బాబు పాలన కంటే వైఎస్ జగన్ పాలన వెయ్యి రెట్లు మేలని వైఎస్సార్‌సీపీ వాళ్లే కాకుండా కరుడు కట్టిన టీడీపీ వాళ్లు మాట్లాడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. రాబోయే రోజుల్లో జగన్ 2.0 పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, అన్ని వర్గాల వారికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వెంకటగిరి, ఉదయగిరి ఇన్‌చార్జిలు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, పార్టీ రాష్ట్ర మహిళా విభాగం నాయకురాలు మల్లి నిర్మల, కార్పొరేటర్ మొయిళ్ల గౌరి, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నినాదాలతో ప్రతిధ్వనించిన నెల్లూరు

- వైఎస్సార్‌సీపీ 'యువత పోరు'కు విశేష స్పందన
- నగరంలో భారీ ర్యాలీ

నెల్లూరు (బారకాసు): విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే బాధ్యత నాది. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించి తీరుతాం అంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు నమ్మబలికారు. ఆ హామీలను నమ్మి ఓటేశాం. తీరా గద్దెనెక్కి చిల్లి గవ్వ కూడా సాయం చేయలేదు.. అంటూ చంద్రబాబు ప్రభుత్వ తీరును ఎండగడుతూ బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు, నిరుద్యోగులు నెల్లూరు నగరంలో కదం తొక్కారు. కూటమి ప్రభుత్వానికి కళ్లు తెరిపించేందుకు ఉద్యమ కెరటాలై ఉవ్వెత్తున ఎగిసి పడుతామని నినదించారు. విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలి, యువత, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి అంటూ చేసిన నినాదాలతో నెల్లూరు నగరం ప్రతిధ్వనించింది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు భృతి ఇవ్వాలి, కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శనతో చంద్రబాబు మోసపూరిత తీరును ఎండగడుతూ విద్యార్థులు వారి తల్లితండ్రులు, యువకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదం తొక్కారు. తొలుత వీఆర్‌సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కావలి, కోవూరు, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఉదయగిరి, కందుకూరు, నెల్లూరురూరల్ ఇన్‌చార్జిలు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, బుర్రా మధుసూదన్‌యాదవ్, ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పార్టీ రాష్ట్ర మహిళా విభాగం నాయకురాలు మల్లి నిర్మల, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మీసునంద, యువజన, విద్యార్థి విభాగాల జిల్లా అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున, అశ్రిత్‌రెడ్డి, పార్టీ మహిళా నాయకురాలు మొయిళ్ల గౌరితోపాటు అధిక సంఖ్యలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ ఆరో, నాలుగో సెమిస్టర్ల పరీక్షలకు 449 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎగ్జామ్స్ అధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. ఉదయం నిర్వహించిన ఆరో సెమిస్టర్‌కు 55 మందికి 47 మంది హాజరు కాగా, మధ్యాహ్నం నిర్వహించిన నాలుగో సెమిస్టర్‌కు 7,573 మందికి 7,132 మంది హాజరయ్యారనితెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని సెయింట్ మేరీ డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని తెలిపారు.

యువత పాల్గొనాలి : కలెక్టర్


పోస్టర్లను ప్రదర్శిస్తున్న కలెక్టర్ తదితరులు

నెల్లూరు రూరల్: యూత్ పార్లమెంట్ – 2025లో 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసున్న యువతీ, యువకులు పాల్గొనాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను తన కార్యాలయంలో బుధవారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి యువత తమ ప్రణాళికలను పంచుకోవడానికి యూత్ పార్లమెంట్ – 2025 మంచి వేదిక అన్నారు. ఆసక్తి గల వారు వన్ నేషన్ – వన్ ఎలక్షన్‌పై మై భారత్ పోర్టల్లో రిజిస్టర్ చేసుకుని వికసిత భారత్‌పై ఒక నిమిషం వీడియోను చిత్రీకరించి నెల్లూరు నోడల్ డిస్ట్రిక్ పోర్టల్లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఉదయ్‌శంకర్ అల్లం (81878 14140) నెహ్రూ యువ కేంద్రం అధికారి డాక్టర్ ఎ.మహేంద్రరెడ్డి (99635 33440)ను సంప్రదించాలన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి


ప్రసాద్ మృతదేహం

సోమశిల: పేద కుటుంబానికి చెందిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన ఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. అనంతసాగరం మండల పరిధిలోని పాతాళపల్లి గ్రామానికి చెందిన భోగ్యం నరసింహులు, రమణమ్మకు ఒక్కగానొక్క కుమారుడు భోగ్యం పెంచల ప్రసాద్ (21) ఉన్నాడు. ఇతడికి మతిస్థిమితం లేదు. ప్రసాద్ బుధవారం మధ్యాహ్నం చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడు. గ్రామస్తులు మృత దేహాన్ని బయటకు తీశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

పోలీస్ ఉద్యోగంపై మక్కువతో..

- నకిలీ అవతారమెత్తిన యువకుడు
- అదుపులోకి తీసుకున్న స్పెషల్ బ్రాంచ్


హరీష్

సంగం: అతను రెండుసార్లు పోలీస్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నాడు. అది రాకపోవడంతో పోలీస్ దుస్తులు వేసుకుని ఎస్సైనని అందరికీ చెప్పుకొని తిరుగుతున్నాడు. ఎస్సై రాజేష్ బుధవారం వివరాలు వెల్లడించారు. అల్లూరు మండలం నార్త్‌అములూరుకు చెందిన నన్నెం హరీష్ అనే యువకుడు సంగం మండలం సిద్ధీపురంలోని తన అమ్మమ్మ ఇంట్లో ఉంటున్నాడు. బీటెక్ చేసిన అతను రెండుసార్లు పోలీస్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఎంపికవలేదు. దీంతో పోలీస్ దుస్తులు కుట్టించుకుని తాను ఆర్‌ఎస్సైనని ఒకసారి, సివిల్ ఎస్సైనని మరోసారి స్నేహితులకు చెప్పి తిరుగుతున్నాడు. కారుకు పోలీస్ స్టిక్కర్ అతికించి రాకపోకలు సాగిస్తున్నాడు. పోలీస్ దుస్తుల్లో ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. రెండురోజుల క్రితం సిద్ధీపురం గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సంగం పోలీసులు విచారించగా ఖాకీ దుస్తులపై ఉన్న మక్కువతో ఇలా చేశానే తప్ప తాను ఎవరినీ మోసం చేయలేదని హరీష్ చెప్పాడు.

మైనర్లను సంరక్షించిన రైల్వే పోలీసులు

- ఏజెంట్లపై కేసు నమోదు


బాలురతో రైల్వే పోలీసులు

నెల్లూరు(క్రైమ్)/నెల్లూరు(పొగతోట): ఈరోడ్, పాలక్కాడ్‌లో పనిచేసేందుకు మైనర్ బాలురను ఇద్దరు ఏజెంట్లు టాటానగర్ టు ఎర్నాకులం రైల్లో తీసుకెళ్తుండగా నెల్లూరు రైల్వే పోలీసులు పట్టుకున్నారు. ఏజెంట్లపై కేసు నమోదు చేసి బాలలను హోంకు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. జార్ఖండ్ రాష్ట్రం గఢ్వా జిల్లాకు చెందిన అంకిత్ లక్రా, ఒడిశా రాష్ట్రం కాందమాల్ జిల్లాకు చెందిన గోపి సన్యాజీలు ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన ఐదుగురు బాలురను రైల్లో తరలిస్తున్నారని బుధవారం బచ్‌పన్ బచావో ఆందోళన్ (బీబీఏ) అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారి కె.శ్రీకాంత్‌కు సమాచారం అందింది. ఆయన నెల్లూరు రైల్వే సీఐ భుజంగరావు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. రైల్వే పోలీసులు, శ్రీకాంత్ ఒంగోలు నుంచి సదరు రైల్లో తనిఖీలు చేస్తూ నెల్లూరు వద్ద ఏజెంట్లను అదుపులోకి తీసుకుని వారి చెరలో ఉన్న బాలురను సంరక్షించారు. ఏజెంట్లపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం బాలురిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచారు. వారు కొండాయపాళెం గేటు సమీపంలోని క్యాప్ (పోలీస్ అండ్ చైల్డ్ ప్రాజెక్ట్) హోంకు తరలించి సంబంధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ తనిఖీల్లో నెల్లూరు రైల్వే ఎస్సై మాలకొండయ్య, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆమె జీవితం కష్టాలమయం

దాతలు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : 82470 32417, 72889 03283


మేరీ, ఐశ్వర్య, మరియమ్మ

- అనారోగ్యానికి గురైన మహిళ
- గుండె, మెదడు సంబంధిత సమస్యలతో బాధపడుతూ..
- పూట గడవక ఇబ్బందులు పడుతున్న వైనం
- దాతల సాయం కోసం ఎదురుచూపులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు నగరంలోని 54వ డివిజన్ జనార్దనరెడ్డి కాలనీలో టిడ్కో గృహ సముదాయంలో మరియమ్మ, ఆమె కుమార్తె సరిపోకు మేరీ అలియాస్ సుభాషిణి అద్దెకు ఉంటున్నారు. సుభాషిణికి ఎనిమిది సంవత్సరాల క్రితం ప్రేమ్‌కుమార్ అనే వ్యక్తితో వివాహమైంది. సంవత్సరం తర్వాత ఆమె గర్భం దాల్చింది. అదే సమయంలో ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంది. గుండెలో రంధ్రాలున్నాయని, చిన్న మెదడులో సమస్య ఉందని వైద్యులు తెలిపారు. శస్త్రచికిత్స చేయాలని, రూ.14 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. ప్రేమ్ కుమార్ భార్యకు అండగా ఉండకుండా వెళ్లిపోయాడు. దీంతో మరియమ్మ తన బిడ్డకు అండగా నిలిచి కాన్పు చేయించింది. అయితే ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆపరేషన్ చేయించలేకపోయింది. మేరీ ఆడ శిశువుకు జన్మించింది. మరియమ్మ భర్త చనిపోయాడు. ఆమె వృద్ధాప్యంలో ఉంది. ఆరోగ్యం సహకరించకపోయినా పాచి పనులు చేసి మేరీ, మనుమరాలు ఐశ్వర్యను చూసుకుంది. ఆమెను ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. కష్టకాలంలో తోడుగా ఉండాల్సిన భర్త తనకేం సంబంధం లేదన్నట్టుగా వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో ఆమె తల్లి తల్లడిల్లిపోయింది. ఓ వైపు వయోభారం, మరో వైపు అనారోగ్యం వెంటాడుతున్నా తన బిడ్డను అక్కున చేర్చుకుని కంటికి రెప్పలా చూసుకుంటోంది. కుమార్తె చికిత్స కోసం దాతల సాయం కోరుతోంది.

కొన్నినెలల నుంచి మేరీ ఆరోగ్యం క్షీణిస్తోంది. ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి పడిపోవడం, ముక్కు, చెవుల నుంచి రక్తం రావడం తదితర సమస్యలతో బాధపడుతోంది. వైద్యులను సంప్రదిస్తే శస్త్రచికిత్స చేయించుకోవాలన్నారు. అప్పటి వరకు తాత్కాలికంగా మందులు వాడాలని సూచించారు.

పూట గడవడమే కష్టం

మేరీ, మనుమరాలు ఐశ్వర్యను చూసుకుంటున్న మరియమ్మ కొంతకాలంగా అనారోగ్యానికి గురికావడంతో ఎలాంటి పనులు చేయలేకపోతోంది. దీంతో వారికి పూట గడవడం కష్టతరంగా మారింది. చుట్టుపక్కల వారు చేసే సాయంతో కాలం వెళ్లదీస్తున్నారు. మరియమ్మ, మేరీకి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందడం లేదు. వృద్ధాప్య, ఒంటరి మహిళ పింఛన్ లాంటి పథకాలు వారి దరి చేరలేదు. ఇంటి అద్దె కట్టలేక ఇబ్బంది పడుతున్నారు. చివరకు కరెంట్ బిల్లు కూడా కట్టలేని దీనస్థితికి చేరుకున్నారు. దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

‘అగ్నివీర్’ రిక్రూట్‌మెంట్ ప్రారంభం

నెల్లూరు రూరల్: అగ్నివీర్ నియామకాలు 2025 – 26 నమోదును గుంటూరు ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం ప్రారంభించినట్లు రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీలకు సంబంధించి www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 10వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. ఒక అభ్యర్థి ఇప్పుడు రెండు వేర్వేరు అగ్నివీర్ కేటగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశపరీక్ష (సీఈఈ) మొదటిసారిగా తెలుగుతో సహా 13 వేర్వేరు భాషల్లో నిర్వహిస్తారన్నారు. 1.6 కిలోమీటర్ల పరుగు సమయాన్ని 6.15 సెకన్లకు పెంచారన్నారు. అన్ని కేటగిరీలకు సంబంధించిన ఎన్‌సీసీ ఏ, బీ, సీ సర్టిఫికెట్ కలిగిన వారికి, ప్రతిభావంతులైన క్రీడాకారులకు, అలాగే అగ్నివీర్ టెక్నికల్ కేటగిరీ కోసం ఐటీఐ/డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు కూడా ఇస్తారన్నారు. ఆసక్తి గల వారు అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, కార్యాలయ సహాయకులు/స్టోర్ కీపర్ టెక్నికల్, వృత్తి నిపుణుల పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 97	బ్రాయిలర్	
లేయర్ (లైవ్)	: 90	స్కిన్‌లెస్	: 200
బ్రాయిలర్ చికెన్	: 180	లేయర్ చికెన్	: 153

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.90
సన్నవి : రూ.60
పండ్లు : రూ.40

